



19వ వసంతంలోకి ...

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

రంగారెడ్డి వికారాబాద్ మేడ్చల్

బుధవారం 12 నవంబర్ 2025 : పేజీలు 8


# అందెశ్రీకి కన్నీటి వీడ్కోలు

◆ పాడే మోసిన సీఎం రేవంత్ రెడ్డి



**ఘట్‌కేసర్, మేజర్ న్యూస్ (నవంబర్ 11):** ప్రముఖ కవి, తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ రచయిత డాక్టర్ అందెశ్రీ అంత్యక్రియలు ప్రభుత్వం అధికార లాంఛనాలతో రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు కవులు కలాకారులు అభిమానులు నాయకుల మధ్య ఘట్‌కేసర్ ఔటర్ జంక్షన్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యలయం సమీపంలో స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాడే మోసి మంగళవారం అందెశ్రీకి కన్నీటీ విడ్కోల్ పలికారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధి ఎన్ఎఫ్‌సి నగర్‌లో

మిగతా 2లో






## కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌కు మంచి భవిష్యత్తు ఉంటుంది

◆ తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ శ్రీ.గడ్డం ప్రసాద్ కుమార్

2 లో



## మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జీవితం ఆదర్శనీయం

◆ జిల్లా రెవెన్యూ అధికారి సంగీత

2 లో



## తుప్పుపడుతున్న జనరేటర్



మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో డీజిల్ జనరేటర్ చాలా ఏళ్లుగా వృథాగా దర్శనమిస్తోంది. అత్యవసర వేళ కార్యాలయానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే కరెంట్ అందించేందుకు ఈ జనరేటర్‌ను తీసుకొచ్చారు. కానీ ఇప్పటికీ దీనిని వినియోగించలేదు. ఎండకు ఎండుతూ.. వానకు నానుతూ ఈ జనరేటర్ తుప్పు తపడుతోంది. వృథాగా ఉన్న జనరేటర్‌కు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

– మంచాల, మేజర్ న్యూస్

# సామాజిక వ్యాపారాలకు వేదికగా 'ఇంపల్స్-2025'

◆ బాలవికాస ఆధ్వర్యంలో అట్టహాసంగా ప్రారంభించిన మంత్రి కొండా సురేఖ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (నవంబర్, 11):** సమాజంలో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో సామాజిక వ్యాపార ఆలోచనలను ప్రోత్సహించేందుకు నిర్వహించిన "సోషల్ స్టార్టప్ సమ్మిట్-ఇంపల్స్ 2025" మంగళవారం కీసరలో అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని పర్యావరణ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. ఈ సమ్మిట్‌ను బాలవికాస సెంటర్ ఫర్ సోషల్ అండ్ రెస్పాన్సిబుల్ బిజినెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 500 మందికి పైగా సామాజిక వ్యాపార వేత్తలు,

మిగతా 2లో



సూర్య
2
బుధవారం
12 నవంబర్

## మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జీవితం ఆదర్శనీయం

### జిల్లా రెవెన్యూ అధికారి సంగీత

**రంగారెడ్డి, మేజర్ న్యూస్ (నవంబర్ 11) :** మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జీవితం ఆదర్శనీయమని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత అన్నారు. మంగళవారం అబ్దుల్ కలాం 137వ జయంతిని జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. అబ్దుల్ కలాం చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్1888 నవంబర్ 11న మక్కాలో జన్మించినట్లు తెలిపారు. ఇంగ్లీష్, ఉర్దూ, హిందీ, పెర్షియన్, బెంగాలి భాషల్లో ప్రావీణ్యుడని కొనియాడారు. దేశంలో విద్యాభివృద్ధికి బాటలువేసిన తొలి విద్యాశాఖ మంత్రిగా అబ్దుల్ కలా పేరొందినట్లు తెలిపారు. జర్నలిజంలో అపార అనుభంతో ఉర్దూ పత్రికను నెలకొల్పి సమాజంలో నెలకొన్న రుగ్మతలను రూపు మాపేపుందుకు కృషి చేసినట్లు చెప్పారు. కేంద్ర విద్యాశాఖ మంత్రిగా పనిచేసి విద్యావ్యవస్థలో గణనీయమైన మార్పులు తీసుకువచ్చినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ జిల్లా సంక్షేమాధికారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అందెశ్రీకి కన్నీటి వీడ్కోలు








**మొదటిపేజీ తరువాయి...**

అందె శ్రీ నూతనంగా నిర్మించుకుంటున్న ఇంటికి పార్ధివ దేహాన్ని తరలించి, అక్కడి నుండి అంతిమ యాత్రగా ఘట్కేసర్ అంబేద్కర్ చౌరస్తా నుండి కళాకారుల పాటలు డప్పు చప్పుళ్ల మధ్య యంనంపేట్ చౌరస్తాకు చేరుకున్న అంతిమ యాత్రలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు నాయకులు పాల్గొని సమాదివరకు చేరుకున్నారు. సమాదివద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి లక్ష్మణ్ పాడెను మోశారు. అనంతరం పోలీసులు గౌరవ వందనంతో సాంప్రదాయ పద్ధతి లో లాంఛన ప్రాయంగా అంత్యక్రియలను నిర్వహించారు. ఈ మేరకు మంత్రలు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, వడ్లూరి లక్ష్మణ్, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్సీ కోదండ రామ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు, జిల్లా కలెక్టర్ మను చౌదరి, మాజీ ఎంపిలు వి హనుమంత్ రావు, సర్వే సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, మాజీ జడ్పిటీసి మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, కవి జయరాజ్, విమలక్క, పాశం యాదగిరి, కుటుంబ సభ్యులు పుష్పగుచ్చాలతో నివాళులు అర్పించారు. అంత్యక్రియల అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ అందె శ్రీ పశువుల కాపరిగా, తాపీ మేస్త్రీగా తెలంగాణ ఉద్యమకారుడిగా రాష్ట్ర సాధనలో గొప్ప పాత్ర పోషించిన వ్యక్తి అని వారిని కోల్పోవడం తెలంగాణ సమాజంతో పాటు తనకు వ్యక్తిగతంగా తీరని లోటని అన్నారు. ఆయన రాసిన ప్రతిపాట తెలంగాణాలో స్ఫూర్తిని నింపిందని అందుకే ఆయన రాసిన జయ జయహే తెలంగాణ గీతాన్ని పాఠ్యాంశంగా చేర్చేందుకు మంత్రివర్గంలో నిర్ణయం తీసుకుంటామని, ఆయన పేరుతో ఒక స్మృతి వనం ఏర్పాటు చేస్తామని అన్నారు. అందెశ్రీ కుంటుంబంలో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ఆయన పాటల సంకలనం నిప్పుల వాగు ఒక భగవద్గీతగా, బైబిల్ గా, ఖురాన్ గా తెలంగాణ సమస్యలపై పోరాడేవారికి గైడుగా ఉపయోగపడుతుందని అన్నారు. 20వేల నిప్పుల వాగు పుస్తకాలను ముద్రించి తెలంగాణలోని ప్రతి గ్రంథాలయంలో అందుబాటులో ఉండే విధంగా చూస్తామని తెలిపారు. అందెశ్రీకి పద్మశ్రీ అవార్డు ఇవ్వాలని గత సంవత్సరం కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడం జరిగిందని, ఈ సంవత్సరం కూడా లేఖ రాస్తామని పేర్కొన్నారు. అందెశ్రీకి పద్మశ్రీ అవార్డు దక్కేలా కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డిలు సహకరించాలని కోరారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు వారికి పద్మశ్రీ తో గౌరవించుకునేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు రాధిక గుప్తా, విజయేందర్ రెడ్డి, కీసర ఆర్డిఓ ఉపేందర్ రెడ్డి, ఘట్ కేసర్ తహసీల్దార్ చంద్రశేఖర్, మున్సిపాలిటీ కమిషనర్ రాజేష్, ఆర్ అండ్ బి ఈఈ శ్రీనివాస్, సాంస్కృతిక సారధి కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌కు మంచి భవిష్యత్తు ఉంటుంది



**వికారాబాద్ మేజర్ న్యూస్ (నవంబర్ 11):** కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్క సోషల్ మీడియా కోఆర్డినేటర్ కుమంచి భవిష్యత్తు ఉంటుందనీ గడ్డం ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఏర్పాటుచేసిన వికారాబాద్ నియోజకవర్గ స్థాయి సోషల్ మీడియా సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి సోషల్ మీడియా ముఖ్యపాత్ర వహించిందని ఆయన గుర్తుచేశారు. భవిష్యత్తులో వారికి మంచి రోజులు ఉంటాయని అన్నారు. అంతేకాక ఏమైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ సందర్భంగా వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సోషల్ మీడియా కార్యదర్శి చామల రఘుపతి రెడ్డి, టీపిసిసి స్పోకెన్ పర్సన్ గౌరీ సతీష్ ,ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ సంతోష్ , మండల పార్టీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, శంకర్, నర్సింగ్ నాయక్, సురేష్, మాన్సింగ్, వెంకటేశం. మరియు వికారాబాద్ నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ చాపల శ్రీనివాస్,యాదగిరి, మరియు నాయకులు, జాఫర్,రాములు యాదవ్, మండల కోఆర్డినేటర్లు సిద్ధు, విజయ్ కుమార్,,వెంకట్,రంగయ్య,నందు మరియు వివిధ గ్రామాల సోషల్ మీడియా కోఆర్డినేటర్లు పాల్గొనడం జరిగింది.

## సామాజిక వ్యాపారాలకు వేదికగా ‘ఇంపల్స్-2025’

**మొదటిపేజీ తరువాయి...**

ఇంపాక్ట్ ఇన్వెస్టర్లు,వ్యాపార నిపుణులు ఈ సమ్మిట్‌లో పాల్గొన్నారు. అలాగే 60కి పైగా సామాజిక వ్యవస్థాపకులు తమ ఉత్పత్తులు, ఆవిష్కరణలను సోషల్ స్టార్టప్ ఎక్స్‌పోలో ప్రదర్శించారు. సమాజ అభివృద్ధికి దోహదపడే ఆలోచనలకు ఈ సదస్సు వేదికగా నిలిచింది.

**సామాజిక వ్యాపారాలకు కొత్త దిశ:**

బాలవికాస వ్యవస్థాపకులు బాల తెరిసా, ఆంద్రే జింగ్రాస్ (కెనడా) ఆన్‌లైన్ ద్వారా మాట్లాడుతూ,.. “ప్రైవేట్ సంస్థలు కేవలం లాభం కోసం వ్యాపారాలు చేస్తున్న ఈ ధోరణిని మార్చాలనే ఉద్దేశంతోనే 2013లో CSRBని స్థాపించాం. ‘ఇంపల్స్-2025’ ద్వారా సామాజిక సమస్యలకు పరిష్కార మార్గాలపై ప్రపంచవ్యాప్తంగా ఆలోచనల మార్పిడి జరగడం గర్వకారణం” అన్నారు. “భారతీయులతో పాటు 40మంది విదేశీయులు పాల్గొనడం ద్వారా పరస్పర అవగాహన, సాంస్కృతిక మార్పిడి, సామాజిక సంబంధాలు బలపడతాయి. ఇలాంటి వేదికలు సమాజ అభివృద్ధికి దోహదపడతాయి” అని తెలిపారు.

**సమాజ సంక్షేమం పట్ల ప్రభుత్వం కట్టుబడి ఉంది – మంత్రి సురేఖ:**

ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ“గత మూడు దశాబ్దాలుగా బాలవికాస సంస్థతో నాకు అనుబంధం ఉంది. సమాజ సమస్యలను పరిష్కరించేందుకు సామాజిక ఆలోచనలు కలిగిన వారిని, ఇన్వెస్టర్లను ఒకే వేదికపైకి తేవడం ప్రాధాన్యమైన విషయం. పరిశ్రమలతో పాటు పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనే ఉంది” అన్నారు. “వనమహోత్సవం కార్యక్రమం ద్వారా గత రెండేళ్లలో తెలంగాణలో 36 లక్షల



మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో రాష్ట్రం ముందంజలో ఉంది. గ్రామీణ ప్రాంతాల ఆలోచనలకు పదును పెట్టి, సమాజానికి ఉపయోగపడే వ్యాపార ఆవిష్కరణలను ప్రోత్సహించాలి. ఇలాంటి కార్యక్రమాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుంది” అని పేర్కొన్నారు.

**యువత ఉద్యోగాలు చేయడం కాకుండా సృష్టించాలి – శౌరి రెడ్డి:**

బాలవికాస ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌరి రెడ్డి మాట్లాడుతూ..“బాలవికాస గత 46 ఏళ్లుగా సమాజ సేవలో ముందంజలో ఉంది. నూతన ఆవిష్కరణలు కేవలం ఆదాయం సమకూర్చేవిగా కాకుండా సమాజ సమస్యలకు పరిష్కారం చూపేవిగా ఉండాలి. యువత ఉద్యోగాలు చేయడం కంటే ఉద్యోగాలు సృష్టించడంపై దృష్టి పెట్టాలి” అన్నారు.

“ప్రభుత్వం ఇలాంటి ఆలోచనలకు మద్దతు ఇస్తే ఉపాధితో పాటు సమాజంలోని అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. యువత ఆవిష్కరణాత్మక ఆలోచనలను సమాజ మార్పు దిశగా మలచాలి” అని సూచించారు.

**ఇంపల్స్-2025లో ఆవిష్కరణల పండుగ:**

రోజంతా సాగిన ఈవెంట్‌లో ఇంపాక్ట్ ఇన్వెస్టర్లు, మెంటార్లు, సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్లు ప్యానెల్ చర్చలు, వర్క్‌షాప్‌లలో పాల్గొన్నారు. 60కి పైగా స్టార్టప్‌లు తమ ఉత్పత్తులు, సేవలు, ఆవిష్కరణలను ప్రదర్శించాయి. వాటిలో,...

- మైనింగ్ కార్మికుల భద్రత కోసం రూపొందించిన పరికరాలు
- డిజిటల్ అక్షరాస్యతను పెంపొందించే టెక్నాలజీ పరిష్కారాలు
- పిల్లల సామాజిక భావోద్వేగ మేధస్సు అభివృద్ధి చేసే విద్యా ఆవిష్కరణలు
- వైకల్యాలున్న వ్యక్తుల కోసం సహాయక పరికరాలు
- కదలలేని స్థితిలో ఉన్నవారికి ఆరోగ్య పర్యవేక్షణ పరికరాలు
- పర్యావరణ హిత వ్యాపార నమూనాలు,

ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

**భాగస్వామ్య సంస్థల సహకారం:**

ఈ సదస్సుకు తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ , ఇంపాక్ట్ హబ్ హైదరాబాద్, కేజీ రెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్, డబ్ల్యుఈ హబ్,టిఐఈ హైదరాబాద్, కాకతీయ శాండ్‌బాక్స్, కేరళ స్టార్టప్ మిషన్, టీ-హబ్,ఎన్ఎస్ఆర్సీఈఎల్, యూత్ ఎయిడ్ ఫౌండేషన్, కామ్ వంటి సంస్థలు వ్యూహాత్మక భాగస్వామ్యులుగా వ్యవహరించాయి.

ఈ కార్యక్రమంలో ఎస్ఈఎల్సీఓ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు హరీష్ హండే, వీ హబ్ సీఈఓ సీతా పల్లచోళ్ళ, బీఎఫ్ఐఎల్ సీఎస్ఆర్ హెడ్ కిషోర్ సాంబాశివం, జర్మనీ ప్రతినిధి సెభాస్టియన్, సీఎస్ఆర్బీ డైరెక్టర్ రాహుల్ భరద్వాజ్, పీడీటీసీ డైరెక్టర్ సునీతా రెడ్డి, బాలవికాస మేనేజర్లు విజేందర్, లతా, తిరుపతి, మంజుల, శివరాం, శోభా, మోసెస్, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ కాంగ్రెస్ నాయకుడు తాళ్ల సంజీవరెడ్డి కన్నుమూత

● శివ్వంపేట పోచమ్మ ● మైసమ్మ ఆలయ చైర్మన్‌గా విశేష సేవలు

**మేడ్చల్ మేజర్ న్యూస్, (నవంబర్, 11):** మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని పూడూరు గ్రామానికి చెందిన ప్రముఖ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు తాళ్ల సంజీవరెడ్డి (72) మంగళవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. గత కొన్ని రోజులుగా అస్వస్థతతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.




తాళ్ల సంజీవరెడ్డి గత 20 సంవత్సరాలుగా శ్రీ శివ్వంపేట పోచమ్మ-మైసమ్మ ఆలయ చైర్మన్‌గా కొనసాగి, ఆలయ అభివృద్ధికి విశేషంగా సేవలు అందించారు. అంతేకాకుండా, ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని ఘనపూర్ గ్రామం వద్ద మెడిసిటీ ఆసుపత్రి సమీపంలోని గుట్టపై శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని అద్భుతంగా నిర్మించి ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. ప్రతి సంవత్సరం మహాశివరాత్రి మరుసటి రోజు భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల కళ్యాణ మహోత్సవంను వైభవంగా నిర్వహిస్తూ, పెద్ద ఎత్తున భక్తులను ఆకర్షించారు. గ్రామాభివృద్ధి పట్ల కూడా ఆసక్తి చూపిన ఆయన, గ్రామంలోని భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి అప్పటి మింట్ అధికారి రాములుతో మాట్లాడి నిధులు మంజూరు చేయించిన ఘనత సాధించారు. మంగళవారం సాయంత్రం నిర్వహించిన అంత్యక్రియలలో గ్రామ మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ వార్డు సభ్యులు, వివిధ రాజకీయ పార్టీలు నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.

# అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి

## సర్పన్‌పల్లి గ్రామ వాసి ఎండి ఉస్మాన్, ఎండి జాఫర్

**వికారాబాద్, మేజర్‌న్యూస్ (నవంబర్ 11):** తమ ఇంటికి వెళ్ళే ధారిని కబ్జా చేసి ఇస్మాయిల్ బీ భర్త ఎండి యూసుఫ్, ఎండి మజీద్ మరియు ఎండి సాజీద్ ఇద్దరు కలిసి ఇంటి నిర్మాణం చేస్తున్నారని సర్పన్‌పల్లి గ్రామానికి చెందిన ఎండి ఉస్మాన్ పేర్కొన్నారు. గతంలో అక్రమ నిర్మాణం చేస్తున్నందున తము హైకోర్టును సంప్రదించడం జరిగిందని అందులో డబ్లు, పి తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని తెలిపారు. గతంలో అక్రమ నిర్మాణ దారులకు వికారాబాద్ ఎంపిడిఓ కార్యాయలం వారు కూడా నోటీసులు అందజేయడం జరిగిందన్నారు. ఆ నోటీలసుకు వారు సరైన ఆదారాలు వారు ఇవ్వలేదని అధికారులు తెలిపినట్లు పేర్కొన్నారు. అయితే డబ్ల్యు పి ఉత్తర్వులు అందే లోపు ఇంటి నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారు. అందుకు నిర్మాణ పనులకు కూడా రాత్రింబవళ్లు చేస్తున్నారని తెలిపారు. ఎండి మాజీద్, ఎండి సాజీద్ వారి వేగవంత పని తీరును చూస్తే వారి వెనుక అధికారుల ప్రోత్సాహం ఉన్నట్లు తెలుస్తుందని తెలిపారు. కావున తక్షణమే ఎండి మాజీద్, ఎండి సాజీద్‌ల గ్రామ కంఠ ఆక్రమణ, అక్రమ నిర్మాణము నిలిపివేసి హైకోర్టు ఉత్తర్వులను గౌరవం ఇవ్వవల్సిందాగా ఆయన కోరారు.



# నవీన ఆదర్శలో అబుల్ కలాం ఆజాద్ జయంతి



**కొడంగల్, మేజర్న్యూస్ (నవంబరు 11):** కొడంగల్ పట్టణంలోని నవీన ఆదర్శ ఉన్నత పాఠశాలలో మంగళవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డివి.నరేశ్ రాజ్ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటారని విద్యార్థులకు వివరించారు. స్వాతంత్ర్య సమరయోధుడు, కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రిగా భారతరత్న అబుల్ కలాం ఆజాద్ దేశానికి అందించిన సేవలను కొనియాడారు. అబుల్ కలాం ఆజాద్ అరబిక్, ఇంగ్లీష్, ఉర్దూ, హిందీ, పర్షియన్, బెంగాలీ తదితర భాషల్లో ప్రావీణ్యత పొందారన్నారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొన్నారని, అన్నీ వర్గాల ప్రజలు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనేలా కీలక పాత్ర పోషించారన్నారు. అదే విధంగా విద్యావ్యవస్థకు బలమైన పునాది వేసిన మహనీయుడన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సంతోవ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విద్యా ప్రేరణగా నిలిచిన మౌలానా అబుల్ కలాం ఆజాద్

● కలెక్టరేట్‌లో ఘనంగా 137వ జయంతి వేడుకలు ● నివాళి అర్పించిన డీ.ఆర్.వో హరిప్రియ




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి,మేజర్ న్యూస్ (నవంబర్, 11):** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో భారత రత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అధికారి (డీ.ఆర్.వో) హరిప్రియ ముఖ్య అతిథిగా హాజరై, మౌలానా ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

**దేశానికి మార్గదర్శకుడైన మహానుభావుడు - కాంతమ్మ:**

ఈ సందర్భంగా జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిణి కాంతమ్మ మాట్లాడుతూ,.. స్వాతంత్ర్య సమరయోధుడు, భారత రత్న, తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి చేసిన సేవలు అపారమని పేర్కొన్నారు. విద్యా విస్తరణకు ఆయన జీవితాన్ని అంకితం చేశారని, అనేక పాఠశాలలు, కళాశాలల స్థాపనలో కీలకపాత్ర పోషించారని తెలిపారు.

స్వాతంత్ర్య సమరంలో 11 సంవత్సరాలు జైలు జీవితం గడిపి, సహాయ నిరాకరణ ఉద్యమం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో ఆయన పాత్ర స్ఫూర్తిదాయకమని కాంతమ్మ అన్నారు. "ఆజాద్ కేవలం రాజకీయ వేత్తగానే కాదు, కవి, రచయిత, సాహితీవేత్తగా కూడా ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయనకు 1992లో భారత రత్న బిరుదు లభించడం దేశ గౌరవానికి ప్రతీక," అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, డీ.ఆర్.డీ.ఏ, క్రీడల శాఖల అధికారులు ఝాన్సీ రాణి, వినోద్ కుమార్, పద్మజ, సాంబశివరావు, దామోదర్ రెడ్డి, కలెక్టరేట్ ఏ.వో రామ్మోహన్, జిల్లా ట్రెజరీ శాఖ అధికారులు, మైనార్టీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి అక్రమ అడ్మిషన్లు

● ప్రైవేట్ స్కూల్స్‌పై చర్యలు తీసుకోవాలి : యూఎస్ఎఫ్

● జిల్లా విద్యాశాఖ ఏడీ లింగనాథం కు వినతిపత్రం అందజేత

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి,మేజర్ న్యూస్ (నవంబర్ 11):** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖ అనుమతి లేకుండా పదవ తరగతి అడ్మిషన్లు తీసుకొని తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని యూనివర్సల్ స్టూడెంట్స్ ఫెడరేషన్ (యూఎస్ఎఫ్) జిల్లా కమిటీ జిల్లా విద్యాశాఖ ఏడీ లింగనాథం కు మంగళవారం వినతిపత్రం అందజేసింది.

ఈ సందర్భంగా యూఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బ్యాగారి వెంకటేష్ మాట్లాడుతూ – "జిల్లాలోని కొంతమంది ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యాశాఖ అనుమతి లేకుండా అక్రమంగా పదవ తరగతి అడ్మిషన్లు తీసుకొని తరగతులు నిర్వహిస్తున్నాయి. ఇది విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతున్న చర్య" అని అన్నారు.

విద్యార్థుల నుండి అక్రమంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను మోసం చేస్తున్న ఈ పాఠశాలలపై ప్రభుత్వం తక్షణమే దర్యాప్తు జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈసీఎల్, గుంటూరు



ఆక్స్ఫర్డ్, భాష్యం, కృష్ణవేణి, టాలెంట్, లిటిల్ ఫ్లవర్ వంటి పాఠశాలలతో పాటు జిల్లాలో మరెన్నో ప్రైవేట్ పాఠశాలలు కూడా ఇలాంటి అక్రమ చర్యలకు పాల్పడుతున్నాయని యూఎస్ఎఫ్ ప్రతినిధులు తెలిపారు. గుర్తింపు లేని పాఠశాలలు రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలను సైతం ఉల్లంఘిస్తున్నాయని వారు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రకాంత్ నాయకులు, నాయకులు కృషి కీర్తన, నవదీప్ తదితరులు పాల్గొన్నారు.

# కడ్తాల్‌లో ఘనంగా మౌలానా అబ్దుల్‌కలాం జయంతి



కడ్తాల్, మేజర్‌న్యూస్ (నవంబర్ 11): స్వాతంత్ర సమరయోధులు, భారత తొలి విద్యాశాఖమంత్రి మౌలానా అబ్దుల్‌కలాం జయంతి వేడుకలను మంగళవారం కడ్తాల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ సీనియర్ నేత, మండల కోఆప్షన్ మాజీ సభ్యులు జహంగీర్‌బాబా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు కార్యక్రమంలో పాల్గొని మౌలానా అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల కోఆప్షన్ మాజీ సభ్యులు జహంగీర్‌బాబా మాట్లాడుతూ మౌలానా అబ్దుల్‌కలాం దేశానికి అందించిన సేవలు, జీవిత చ రిత్రను వివరించారు. ఈకార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వేణుగోపాల్, మాజీ ఎంపిటిసి గురిగళ్ల లక్ష్మయ్య, కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు అజ్గర్‌అలీ, భరత్ యాదవ్, భాను కిరణ్, తుప్పరి మహేష్, మోత్యా నాయక్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

# లార్డ్స్ స్కూల్ మల్లాపూర్‌లో ఉత్సాహంగా "క్రీడో" కార్యక్రమం

బాలాపూర్, మేజర్ న్యూస్ (నవంబర్ 10): బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మల్లాపూర్‌లో గల లార్డ్స్ స్కూల్‌లో "క్రీడో" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల ప్రతిభ, సృజనాత్మకతను వెలికితీసే ఉద్దేశంతో జరిగిన ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. ఈ సందర్భంగా లార్డ్స్ విద్యాసంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మన్ బెర్లు శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ సిద్దాల శ్రీలత, డీన్ శ్రీ సతీష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి

మాట్లాడిన చైర్మన్ సిద్దాల బీరప్ప..క్రీడో వంటి కార్యక్రమాలు విద్యార్థులలో మానసిక ఉల్లాసం, సృజనాత్మక ఆలోచనలకు మార్గం సుగమం చేస్తాయి. పిల్లలు పుస్తక చదువుతో పాటు శారీరక చైతన్యాన్ని కూడా పొందాలి" అని పేర్కొన్నారు. వైస్ చైర్మన్ బెర్లు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.."క్రీడో కార్యక్రమం విద్యార్థుల మానసిక అభివృద్ధికి, ఇంగ్లీష్‌లో అనర్గళంగా మాట్లాడే నైపుణ్యాల పెంపుకు దోహదపడుతుంది అని తెలిపారు. డీన్ సతీష్ మాట్లాడుతూ..ఈ కార్యక్రమం ద్వారా తల్లిదండ్రులు తమ పిల్లల ప్రతిభను దగ్గరగా గమనించగలరు. పిల్లల అభివృద్ధికి పేరెంట్స్ ప్రోత్సాహం కీలకం" అని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కొండలరావు, ఇన్‌చార్జ్ శేఖర్ పాల్గొని విద్యార్థులను అభినందించారు.

**IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE, AT: SHADNAGAR**

O.S.NO. 357 OF 2024

Between: -
Erravelly Naveen Chary & Another. ... Plaintiffs
AND
Telkala Ashok Reddy, & others .... Defendants

To,
Telkala Radha Krishna Reddy S/o. Late. Telkala Janardhan Reddy, Aged about 45 years, Occ: Agriculture R/o. 4-21/A, Kothapeta Village, Keshampet Mandal, R.R. Dist. D 6.

Please take notice that the above plaintiffs filed suit for perpetual injunction of suit scheduled property and the said petition stand posted for your appearance on 28-11-2025 before the above court. Please do appear before the said court on the said date at 10.30 a.m. in person or through counsel, failing which the matter will be decided in your absence

By order of the court
**J.RAJESHWAR RAO**
H.no. 16-11-1/5/11 & 12
Saleemnagar, Malakpet,
Hydrabad-500036.
Phone: 9848994225,
Advocate for plaintiff

# కరాటే ప్రశంసా పత్రాలు అందజేత



మహేశ్వరం,మేజర్ న్యూస్(నవంబరు 11): నార్సింగ్‌లో తుక్కుగూడ మున్సిపాలిటీ సర్దార్ నగర్ చెందిన కరాటే శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రశంస పత్రాలను మాజీ కౌన్సిలర్ రెడ్డిగళ్ల సుమన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ తరుణ్,పబ్బతి శివ,బలరాం,సెహ్వాగ్,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు : సీడీపీవో శాంతి శ్రీ

## కస్తూర్బా పాఠశాలలో అవగాహన కార్యక్రమం





కందుకూరు, మేజర్‌న్యూస్( నవంబర్ 11): బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు వస్తాయని మహేశ్వరం సీడీపీవో శాంతి శ్రీ అన్నారు.బాల్య వివాహాల నిరోధక చట్టంపై మంగళవారం మండలంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా శాంతిశ్రీ మాట్లాడుతూ.. బాల్య వివాహాలను ఎట్టి పరిస్థితుల్లోను అనుమతించేది లేదని చట్టాలు చెపుతున్నాయని, వీటిని నియంత్రించేందుకు కఠినమైన నిబంధనను అమలులోకి వచ్చాయని ఆమె పేర్కొన్నారు. బాలికకు 18 ఎళ్లు, యువకుడికి 21 ఏళ్లు నిండి ఉండాలని తెలిపారు.బాల్యంలో వివాహాలు చేసుకోవడం వల్ల చిన్న వయస్సులో గర్భం దాల్చడంతో ప్రసవ సమయంలో తల్లి బిడ్డకు చాల ప్రమాదంతో పాటు పిల్లలు అనారోగ్యం బారిన పడతారని వివరించారు. చిన్న వయస్సులో పెళ్లి చేసుకోవడం వలన కుటుంబ వ్యవహారాలపై అవగాహన లేక కుటుంబ కలహాలు ఏర్పడి హింసకు దారి తీస్తుందని సీడీపీవో అన్నారు.బాల్య వివాహాలు 2012 చట్టం ప్రకారం బాల్య వివాహాలు చేసుకుంటే 2 ఏళ్లు జైలు శిక్షపడుతుందని తెలిపారు. ఇలాంటి నేరాలకు ఏవరైనా పాల్పడితే 1098,100 నంబర్లకు కాల్ చేయాలని విజ్ఞప్తి చేశారు. వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనభర్చినవారికి బహుమతులు అందించారు.కార్యక్రమంలో సూపర్‌వైజర్ సబిత,ప్రధానోపాధ్యాయురాలు, అంగన్వాడీ టీచర్ స్వాతి,కల్పన, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

★పిల్లలు మత్తు పదార్థాలు,మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

:- పిల్లలు మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని హెల్త్ సూపర్‌వైజర్ సత్యనారయణ పేర్కొన్నారు. నశా ముక్త భారత్ కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని రాచులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ సెక్టార్ సూపర్ వైజర్ శ్రీలత ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమంతో పాటు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు సేవించడం ద్వారా చిన్నారుల్లో శారీక ఎదుగుదల ఉండదని, మానసికంగా కృంగి పోయి,అనారోగ్యం బారిన పడటం జరుగుతుందన్నారు. నేటి బాలలు రేపటి పౌరులుగా మారాల్సిన వారు సమాజానికి, కుటుంబానికి దూరం అయ్యే అవకాశం ఉందన్నారు. మత్తు పదార్థాలు దూరంగా ఉండి బంగారు భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవేందర్‌రెడ్డి, ఏఎన్ఎం మణెమ్మ, పంచాయతీ కార్యదర్శి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు సురేందర్‌రెడ్డి, అనిల్, కల్పన, రాఘవ,మంజుల,మంగ,అంగన్వాడీ టీచర్స్, ఆశా వర్కర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

# యువ కళాకారులకు ఆహ్వానం

▶▶ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 15 వరకు వివరాల నమోదుకు
17న జిల్లా స్థాయి యువ కళాకారుల ఎంపిక ▶▶ గెలుపొందిన కళాకారులకు
న్యూ ఢిల్లీలో జరిగే యువజనోత్సవంలో పాల్గొనే అవకాశం

రంగారెడ్డి, మేజర్ న్యూస్ (నవంబర్ 11): వచ్చే ఏడాది జనవరి 10వ తేది నుంచి 12వ తేది వరకు న్యూ ఢిల్లీలో 29వ జాతీయ యువజనోత్సవం నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న యువజనోత్సవంలో యువ కళాకారులు పాల్గొనేందుకు కళాకారులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందుకు సంబంధించి జానపదం, జానపద నృత్యం, కథ రచన, వక్తృత్వం, కవిత్వ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సరూర్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో ఈనెల 17వ తేదినా ఉదయం 9 గంటల నుండి ఎంపిక జరుగుతుందని చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనే అభ్యర్థుల వయస్సు 15 సంవత్సరాల నుంచి 29 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొందిన కళాకారులను రాష్ట్ర స్థాయిలో పాల్గొనేందుకు అర్హులు అని చెప్పారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన ఉత్తమ కళాకారులు జనవరి 10 నుంచి 12 వరకు న్యూ ఢిల్లీలో జరిగే జాతీయ యువజనోత్సవాల్లో పాల్గొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రదర్శనల్లో పాల్గొనే ఆసక్తిగల యువతీ యువకులు ఈనెల 15వ తేదిలోపు పేరు, వయస్సు, పుట్టిన తేదీ, ఆధార్‌నెంబర్, చిరునామా, ఫోన్ నెంబర్ ప్రదర్శన పేరు, తదితర వివరాలతో ఈమెయిల్ ఛీడయొట్టుఝట్బఛీ ఛీడజుర్ఝజీజు.ఛొను ద్వారా పంపాలని తెలిపారు. ఈ మెయిల్ ద్వారా పంపని అభ్యర్థులు సరూర్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో జిల్లా యువజన క్రీడల అధికారికి సమర్పించాలని చెప్పారు. మరిన్ని వివరాల కోసం 9849909077ను సంప్రదించాలని ఆయన కోరారు.

# మాడ్గుల విద్యుత్‌శాఖ ఏఇ శ్రీనివాసరావు బదిలీ

▶▶ విద్యుత్‌శాఖ ఉద్యోగులు, సిబ్బంది ఆధ్వర్యంలో బదిలీపై వెళ్తున్న శ్రీనివాస్‌రావుకు ఘన సత్కారం
▶▶ మాడ్గుల విద్యుత్‌శాఖ ఏఇగా ఇంచార్జ్ బాధ్యతలు చేపట్టిన సబ్ ఇంజనీర్ గిరిబాబు






మాడ్గుల, మేజర్‌న్యూస్ (నవంబర్ 11):మాడ్గుల మండల విద్యుత్‌శాఖ సహాయ ఇంజనీర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌రావు హైద్రాబాద్ జీహెచ్ఎంసికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మాడ్గుల విద్యుత్‌శాఖ సబ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న గిరిబాబుకు ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు మంగళవారం విద్యుత్‌శాఖ ఉద్యోగులు, సిబ్బంది ఆధ్వర్యంలో బదిలీపై వెళ్తున్న ఏఇ శ్రీనివాస్‌రావు, ఇంచార్జ్ బాధ్యతలు చేపట్టిన గిరిబాబులతో పాటు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమనగల్లు విద్యుత్ సబ్ డివిజనల్ ఇంజనీర్ బాలకృష్ణారావు, తలకొండపల్లి మండల ట్రాన్స్‌కో ఏఇ విజయ్‌కుమార్‌లను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఏఇ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ మాడ్గుల మండలంలో విద్యుత్‌శాఖ సేవలను పారదర్శకంగా అందించేందుకు కృషిచేసిన సహచర ఉద్యోగులు, సిబ్బందితో పాటు అన్నివిధాలుగా సహకరించిన గ్రామపంచాయతీల నాయకులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ ఉప కేంద్రాలలో పనిచేస్తున్న విద్యుత్‌శాఖ ఉద్యోగులు నాగేశ్వర్‌రావు, పందుల సోమయ్యగౌడ్, పగడాల నరేష్, లాలయ్య, దస్రు, వెంకన్న, శ్రీను, కిషన్, శివ, సురేష్, రవీందర్, యాదయ్య, రమేష్, రసూల్, రవీందర్‌రెడ్డి, శ్రీను, దాసు, నాయిని సత్యనారాయణ, సద్విజన్, బాచ, సుధాకర్, రవి, విద్యుత్ కాంట్రాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలకు అకడమిక్ క్యాలెండర్లు

▶▶ నెలల వారీగా కార్యకలాపాల ముద్రణ
▶▶ పరీక్షలు, సెలవుల వివరాలతో రూపకల్పన




మంచాల, మేజర్ న్యూస్ (నవంబర్ 11) : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు అకడమిక్ క్యాలెండర్లను అందిచింది. ఈ విద్యా సంవత్సరం నుంచి అన్ని పాఠశాలల్లో వీటిని సరఫరా చేశారు.

★ లక్ష్యం ఇలా..

పాఠశాల విద్యాశాఖ ప్రతీ విద్యార్థికీ ఉచితంగా, సమానంగా నాణ్యమైన విద్య అందేలా చేయడమే ప్రధాన లక్ష్యంగా నిర్దేశించుకుంది. ప్రతీ విద్యార్థిలో పఠనం, లెక్కలు, శాస్త్రీయ ఆలోచన, డిజిటల్ పరిజ్ఞానం, వంటి అంశాల్లో దృఢమైన పునాదులను ఏర్పర్చేలా కృషి చేస్తున్నట్లు చెబుతున్నారు. విద్యార్థి సమగ్ర అభివృద్ధి కోసం నైపుణ్యాలు, విలువలు సామాజిక-భావోద్వేగ సౌఖ్యాన్ని పెంపొందించడమనే లక్ష్యాలను క్యాలెండర్లపై ముద్రించారు.




★ గతంలో ఫోన్‌లోనే...

ఇప్పటి వరకు హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు అకడమిక్ క్యాలెండర్‌ను ఫోన్‌లోనే పంపించేవారు. ఈసారి కొత్తగా ముద్రించి పంపిణీ చేశారు. దీనిపై అన్ని వివరాలు ఉండడంతో ఏయే తేదీలలో ఏయే కార్యక్రమాలు నిర్వహించాలో తెలిసిపోతుంది.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



కేశంపేట, మేజర్‌న్యూస్ (నవంబర్ 11): కేశంపేట మండలం లింగంధనలో గత నాలుగు రోజుల క్రితం మృతి చెందిన గండికోట జంగమ్మ కుటుంబానికి మంగళవారం మాజీ జడ్పిటిసి తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా అందజేశారు. కుటుంబసభ్యులకు నాయకులు సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కార్యదర్శి బండెల రాజేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రతాప్, నాయకులు నెల్లికంటి బాలయ్య, పురుషోత్తం, బాలరాం, గుమ్మడయ్య, నర్సింహ్మా, రామకృష్ణ, ఎస్.రామకృష్ణ, మహేష్, లింగం, శ్రీకాంత్, సాయిబాబా, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మంగళం జిన్నర్స్ మిల్‌లో సీసీఐ ప్రారంభం ఎప్పుడో?

- యల్-2 ప్రారంభం చేసి వదిలేసిన పాలకులు- అధికారులు
- యల్ -1 లో రోజుకు 2000 వేల క్వింటాళ్ల ఖరీదు ఎప్పుడో
- ప్రారంభం కోసం ఎదురు చూస్తున్న రైతులు, యజమానులు



పెద్దేముల్‌య మండలంలో మంగళం కాటన్ మిల్‌లో నేటికి సీసీఐ తుకాలు ప్రారంభం కాని దృశ్యం

**పెద్దేముల్,మేజర్ న్యూస్ (నవంబర్ 11)ః** మంగళం జిన్నింగ్ కాటన్ మిల్‌ను పాలకులు, అధికారులు సీసీఐ కొనుగోలు సెంటర్‌ను ప్రారంభం చేసి పది రోజులు దాటిన నేటికి పత్తి తుకాలు కావడం లేదు. దీంతో మంగళం కాటన్ మిల్ యజమానులు ఎప్పుడు ప్రారంభం అవుతుందో అంటు ఎదురు చుస్తున్నారు. పాలకులు, అధికారులు మాత్రం త్వరలో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభం చేస్తామంటు యల్-1 సుమిత్ర కాటన్ మిల్‌తో పాటు యల్- 2 మంగళం మిల్‌ను కోటపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ ఆంజయ్య, వైస్ చైర్మన్ నారాయణరెడ్డి కోటపల్లి ఏఎంసీ ఇన్‌చార్జీ సెక్రట్రి ముక్రంఖాన్‌తో పాటు పాలక వర్గం సభ్యులు మండలంలో ఉన్న రెండు సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఈ నెల 2న ప్రారంభం చేశారు. సుమిత్ర కాటన్ మిల్‌తో సీసీఐ కొనుగోలు ప్రారంభం కాక, నేటికి మంగళం జిన్నింగ్ మిల్‌లో సీసీఐ తుకాలు ప్రారంభం కాక పోవడంతో అటు రైతులు ఇటు మంగళం జిన్నింగ్ మిల్ యజమానులు ప్రభుత్వ అనుమతి కోసం ఎదురు చూస్తున్నారు. మండలంలో రెండు సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం అయితే సుమిత్ర కాటన్ మిల్‌లో తుకాలు కాకున్న, మంగళం జిన్నింగ్ మిల్‌లో తుకాలు చేసుకోవచ్చని రైతులు అంటున్నారు. కాని ఒకటి తప్ప నేటికి మరోకటి ప్రారంభం కాలేదు..సుమిత్ర కాటన్ మిల్‌లో ఒకే రోజు సుమారు 2000 నుండి 2200ల క్వింటాళ్ల వరకు పత్తి ఖరీదు అయితే మరుసటి రోజు మరోక సీసీఐ కొనుగోలు కేంద్రంను ప్రారంభం చేయాలన్నది ప్రభుత్వ పాలసి. కాని పది రోజులు దాటిన సుమిత్ర కాటన్ మిల్‌లో ఒకే రోజు 1200 నుండి 1500ల కింటాళ్ల పత్తి తుకాలు దాటడం లేదు.దానికి తోడు పత్తి రైతులు పత్తి పంటను విక్రయాలకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కపాస్ కిసాన్ స్లాట్‌లు బుక్ సమయానికి కాక మరో పక్క రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని వ్యవసాయ అధికారులకు అడుగగా తమకేమి తెలియదని చేతులు ఎత్తేస్తున్నరు. దీంతో రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రంను తీసుకెళ్లిన పత్తి రైతులు సమయానికి స్లాట్ బుక్ కాక, తుకాలు జరుగక, ప్రభుత్వ మద్దతు ధర దక్కక మార్కెట్‌లో దళారులను ఆశ్రయించక తప్పడం లేదని వాపోతున్నారు. ఈ నెల 10 (సోమవారం) రోజు స్లాట్ బుక్ కాక పెద్దేముల్ మండలంలోని ఇందూరు, ఆత్కూర్, పెద్దేముల్, గాజీపూర్‌తో పాటు పలు గ్రామాల రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రంలో తుకాలు కాక పెద్దేముల్ మండల కేంద్రంలో మార్కెట్లో రూ.6200 నుండి రూ.6500ల వరకు విక్రయాలు చేయడం జరిగిందని చెబుతున్నారు. ప్రభుత్వం మద్దతు ధర రూ.8110 దక్కుతుందని ఎదురు చేస్తున్న రైతులకు ధర దక్కడం లేదు అంటున్నారు.

**పాత పద్దతి ముద్దు ...**

గతంలో రైతులు పండించిన పత్తి పంటను నేరుగ సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లి, సంబందిత రైతు పట్టా పాస్ బుక్, బ్యాంక్ బుక్‌తో పాటు ఆధార్ కార్డును తీసుకెళుతే అక్కడ ఉన్న వ్యవసాయ, మార్కెట్, సీసీఐ అధికారులు రైతు పేరును నమోదు చేసుకోని తుకాలు చేసి , కాంట పట్టీలు ఇచ్చెదని, ప్రస్తుతం కపాస్ కిసాన్ పేరుతో ఏర్పాటు చేసిన స్లాట్ సమయానికి బుక్ కాకా రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని సీసీఐ. వ్యవసాయ,




మంగళం జిన్నర్ మిల్

మార్కెట్ అధికారులకు పిర్యాదులు చేసిన సరైన సమాదానం లేక రైతులు ప్రతి నిత్యం పాట్లు పడుతున్నామని పలు గ్రామాల రైతులు వాపోతున్నారు. దానికి తోడు సీసీఐ కేంద్రాలకు డీసీఎం ద్వార వచ్చిన పత్తిని లోడర్స్ సమయానికి కాళీ చేయక రైతులకు ఇబ్బందులు తప్పడం లేదన్న ఆరోపనలు వినబడుతున్నాయి. ప్రభుత్వం సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభం చేసి పది రోజులు దాటిన నేటికి పత్తి రైతులకు సమస్యలు తప్పడం లేదని వాపోతున్నారు.తాండూరు నియోజక వర్గంలో పూర్తి స్థాయిల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం అయితే పెద్దేముల్ మండలంలో ఉన్నా రెండు మిల్లులో , ఓ మిల్లులో నేటికి పత్తి తుకాలు ఎందుకు ప్రారంభం కావడం లేదని పలు గ్రామాల రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే పెద్దేముల్ మండలంలో 40 శాతం పత్తి తీతలు కూడ పూర్తి అయ్యాయి. కురిసిన భారీ వర్షాలకు దిగుబడి తగ్గిన ఉన్న పంట కైన ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర రూ.8110 దక్కుతుందని అనుకుంటే కపాస్ కిసాన్ స్లాట్ సమయానికి బుక్ కాకా మార్కెట్లో తక్కువ ధరకు విక్రయాలు చేయవలసి వస్తుందని పలు గ్రామాల రైతులు అంటున్నారు.ఇప్పటికైన ప్రభుత్వం పాత పద్దితిలో తుకాలు చేయాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.

**ఎకరాకు 7 క్వింటాళ్లు...**

గతంలో ప్రభుత్వం ఎకరాకు 12 క్వింటాళ్ల పత్తి సీసీఐ ద్వార కొనుగోలు చేయగా, ఈ ఏడాది ఎకరాకు 7 క్వింటాళ్లు సీసీఐ కొనుగోలు చేయడంతో పంటలు బాగుంది, దిగుబడి సక్రమంగా వచ్చిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పాత పద్దతిలో చేయాలని పలువురు కోరుతున్నారు.



పత్తి తుకాలు కాక కళ తప్పిన కాటన్ మిల్

# విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి...



భోజనాన్ని పరిశీలిస్తున్న మండల వైద్యాధికారి

## మండల వైద్యాధికారి కిరణ్ కుమార్ గౌడ్

**కుల్కచర్ల, మేజర్ న్యూస్ (నవంబర్ 11)** విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని మండల వైద్యాధికారి కిరణ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం కుంకుచర్ల మండల పరిధిలోని బండవెల్కిచర్ల బాలుర గురుకుల హాస్టల్ ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని గురించి అడిగి తెలుసుకున్నారు. శీతాకాలం సమీపించడంతో రోగాల బారిన పడే అవకాశం ఉందని కావున పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్ రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ వెంకటయ్య, ఏఎన్ఎం సుజాత పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# అబుల్ కలాం ఆజాద్ గొప్ప దార్శనికుడు

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆజాద్ జయంతి



ఆజాద్ జయంతిలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డా.బీ.శ్రీనివాస్‌రెడ్డి

**కొడంగల్, మేజర్ న్యూస్ (నవంబరు 11):** భారత రత్న, స్వాతంత్ర్య భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ గొప్ప దార్శనికుడని ప్రిన్సిపాల్ డా.బీ.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆజాద్ జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా.బీ.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అబుల్ కలాం ఆజాద్ స్వాతంత్ర్య సమరయోధుడే కాకుండా విద్య పట్ల ఆధునీక భావాలు కలిగిన గొప్ప దార్శనికుడని కొనియాడారు. విద్య స్వేచ్ఛకు పాస్‌పోర్టు లాంటిందని, జాతి నిర్మాణానికి, నైతిక విలువలు పెంపోందించేందుకు, మానవుడి ఉత్తమ భవిష్యత్తుకు విద్య ఒక్కటే మార్గం అన్నారు. విద్యార్థి కేంద్రీకృత విద్య, ప్రయోగాత్మక విద్య, నైపుణ్య ఆధారిత విద్య, సృజనాత్మక, గుణాత్మక, విలువలతో కూడిన విద్య నేటి సమాజానికి ఎంతో అవసరమన్నారు. జాతీయ విద్యాదినోత్సవం స్ఫూర్తిగా విద్యార్థులు సంపూర్ణ అక్షరాస్యతకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రఫియాఖానమ్, ఐక్యూ ఏసీ సమన్వయ కర్త టి.రాంబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డా.ఆర్.శ్రీనివాస్, సోమ్లా, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# మీసేవ సెంటర్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి

- తహసిల్దార్ గోవిందమ్మ



**దోమ, మేజర్ న్యూస్ (డిసెంబర్ 11)ః** దోమ మండల తహశీల్దార్ కార్యాలయమునకు సంబంధించి మీకు ఎలాంటి అవసరము ఉన్న మీసేవ సెంటర్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తహసిల్దార్ గోవిందమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కులము,ఆదాయము,గ్యాప్,నాన్ క్రిమిలయర్, జనణ, మరణ దృవపత్రాలు, భూ భారతి పోర్టల్ కి సంబంధించి స్లాట్ బుక్కింగ్ కాని, టీయం-33,పిఓబి,డిఎస్ మిస్సింగ్ మరియు ఇతరములు తప్పని సరిగా మీసేవ సెంటర్ లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తహసిల్దార్ కోరారు. మండలంలో మరి ఏ సీఎస్సీ లేక ప్రైవేటు నెట్ సెంటర్లలో పైన చూపించిన ధ్రువపత్రములను దరఖాస్తు చేయకూడదన్నారు. ఈ దరఖాస్తులు చేసిన వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహశీల్దార్ మండల ప్రజలకు సూచించారు.

# మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి



**కొడంగల్, మేజర్‌న్యూస్ (నవంబరు 11):** మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని మైనారిటీ నాయకుడు ఎస్ఎం.గౌసన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మంగళవారం కొడంగల్‌లో ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎం.గౌసన్ మాట్లాడుతూ లౌకిక వాది, దేశ ఐక్యతకు అంకితభావంతో పని చేసిన మహానుభావుడు ఆజాద్ అని కొనియాడారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులని, గాంధేయవాది, భారత స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో జాహేద్ హుసేన్, మొహ్మద్ రహీం, మొహ్మద్ నసీర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ఎమ్మెల్యే ప్రొసీడింగ్‌ల పంపిణీ



ఆమనగల్లు, మేజర్ న్యూస్ (నవంబర్ 11) నేడు ఆమనగల్లు పట్టణంలోని లక్ష్మీ గార్డెన్ లో ఉదయం 11 గంటలకు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రొసీడింగ్ లను అందజేసి ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ఆమనగల్లు మున్సిపాలిటీ కి ఎమ్మెల్యే కృషితో తొలి విడతలో 360 ఇల్లు మంజూరి అయ్యాయని చెప్పారు. అందులో నేటికీ నిర్మాణం చేపట్టని వాటి స్థానంలో కొత్తగా మంజూరైన 38 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే పట్టాలను పంపిణీ చేస్తారని ఆయన వివరించారు. అనంతరం 76 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# రోడ్డు విస్తరణలో అధికారుల వివక్ష !

- ఒక భవనాన్ని కూల్చక పోవడంతో వృధాగా మారిన బ్రిడ్జ్ కోట్లాది రూపాయల ప్రజాధనం వృధా
- పార్కింగ్ అడ్డాగా మారిన నూతన వంతెన కొత్త బ్రిడ్జి నిర్మించినా పాత బ్రిడ్జి పై నుండే రాకపోకలు



షాద్నగర్ రోడ్డుపై రోడ్డుకు అడ్డంగా ఉన్న భవనం



పార్కింగ్ కు అడ్డాగా మారిన నూతన బ్రిడ్జ్



రోడ్డు విస్తరణ కోసం కూల్చిన దుకాణాలు, ఇండ్లు (ఫైల్).



భవనం కూల్చక పోవడంతో వృధాగా ఉన్న నూతన బ్రిడ్జి

ఆమనగల్లు, మేజర్ న్యూస్ (నవంబర్11) ఆమనగల్లు పట్టణంలో రోడ్డు విస్తరణలో భాగంగా ఆర్ అండ్ బి అధికారుల వివక్ష, నిర్లక్ష్యం కారణంగా కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన బ్రిడ్జ వృధాగా మారిందని పట్టణ ప్రజలు వాపోతున్నారు. ఏడాది క్రితం వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఆమనగల్లు పట్టణంలోని సంద బావి నుండి సుర సముద్రం చెరువు కట్ట వరకు 66 ఫీట్లు రోడ్డు విస్తరణ చేపట్టాలని నిర్ణయించి ప్రతిపాదనలు సిద్ధం చేయగా ప్రజలు, ప్రజాప్రతినిధులు వినతి మేరకు 30 ఫీట్ల రోడ్డుగా మార్చేందుకు నిర్ణయం తీసుకున్నారు. నిర్మాణంలో భాగంగా ముందుగా జాతీయ రహదారి నుండి సురసముద్రం వరకు నిర్మాణం పనులకు గాను రోడ్డు కిరువైపుల ఉన్న దుకాణాలను తొలగించుకోవాలని నోటీసులు జారీ చేసి 21 ఫీట్ల వెడల్పుతో మార్కింగ్ చేసి అనంతరం కాంట్రాక్టర్ తొలగించారు. నిర్మాణంలో భాగంగా చెరువు అలుగు పై ఉన్న పాత బ్రిడ్జి పురాతనం కావడంతో బ్రిడ్జి ఇరువైపులా నాలుగు కోట్ల 20 లక్షల రూపాయలు వెచ్చించి రెండు బ్రిడ్జి ల నిర్మాణం చేపట్టి పనులను వేగవంతం చేశారు. రోడ్డు విస్తరణ లో భాగంగా సంద బావి నుండి సురసముద్రం చెరువు వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన దుకాణాలు, ఇండ్లను తొలగించిన అధికారులు ఒక భవనాన్ని కూల్చకుండ ఉండడంలో అంతర్యం ఏమిటని , పేదల ఇల్లు కూల్చి పెద్దల ఇండ్లను వదిలేస్తారా అని పట్టణ ప్రజల ప్రశ్నిస్తున్నారు. ఫలితంగా బ్రిడ్జ్ కు అడ్డంగా భవనం మారి బ్రిడ్జ్ వృధాగా మారి పార్కింగ్ కు అడ్డాగా మారిందని వారు చెప్పారు. రోడ్డు నిర్మాణం చేపట్టిన అధికారులు రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించక పోవడంతో భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని వారు చెప్పారు.ప్రస్తుతం అధికారులు ఈ రోడ్డుపై డివైడర్ ఏర్పాటు చేసి లైటింగ్ ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి వేళలో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని, రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు అడ్డంగా ఉన్న భవనాన్ని తొలగించి పేదలకు, పెద్దలకు ఒకే న్యాయమని నిరూపించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## కార్తిక వన సమారాధన మహోత్సవం




బాలాపూర్, మేజర్ న్యూస్ (నవంబర్ 10):బడంగ్‌పేట్ కార్పొరేషన్ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీశ్రీ పద్మావతి అలివేలు మంగ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం కార్తీక వన సమారాధన కార్యక్రమం భక్తి శ్రద్ధలతో జరిగింది.

ఈ కార్యక్రమానికి సంఘం అధ్యక్షులు మంగు రాఘవరావు, గౌరవాధ్యక్షులు తుంగతుర్తి మోహన్‌రావు, చక్రవర్తులు మదన్మోహన్ ఆచార్యులు నాయకత్వం వహించారు. అనురాధ కోశాధికారి, ఉపాధ్యక్షులు వేముల కవిత, నవీన్‌కుమార్, మైథిలి, మాధురి, మహిళా అధ్యక్షురాలు సుధారాణి, రాంబట్ల అఖిల్, నరేందర్, మంత్రాల శ్రీరామ్ మూర్తి, జనగామ శంకరరావు, మధుసూదన్‌రావు తదితరులు ఈ మహోత్సవ కార్యక్రమ ఏర్పాట్లను సమన్వయపరిచారు.

ఉదయం 6 గంటలకు మహా రుద్రాభిషేకం, 8 గంటలకు జ్యోతి ప్రజ్వలన, అనంతరం గోపూజ, కార్తీక దామోదర ఉసిరిచెట్టుకు పూజా కార్యక్రమం నిర్వహించారనీ తెలిపారు. మహిళా భక్తులు సామూహికంగా లలితా విష్ణు పారాయణం జరిపి ఆధ్యాత్మిక వాతావరణాన్ని అలరించారు.

ఉదయం 11 గంటల నుండి బ్రాహ్మణ పెద్దల ఉపన్యాసాలు కొనసాగగా, ధార్మిక విశేషాలతో సభ ఘనంగా సాగిందినీ మంగా రాఘవరావు అన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ పి.వి. నరసింహారావు తనయ, ఎమ్మెల్సీ సురభి వాణీ దేవి హాజరై ప్రసంగించారు.విశిష్ట అతిథులుగా తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్యక్షులు మోత్కూరి రామేశ్వరరావు, చైర్మన్ వెన్నంపల్లి జగన్మోహన్ శర్మ, విశ్రాంత న్యాయమూర్తి జానకీరామారావు, బ్రాహ్మణ పెద్దలు చింతపల్లి మంగపతిరావు పాల్గొన్నారు. జిల్లా బ్రాహ్మణ సంఘ నాయకులు, పెద్దలు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించాలి : ఆధ్యాత్మిక వేత్త భాస్కరయోగి



కొందుర్గు, మేజర్‌న్యూస్(నవంబర్ 11): భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించాలి ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త భాస్కరయోగి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ముట్పూర్‌లో శ్రీఅంజనేయస్వామి దేవాలయం పంచమ వార్షికోత్సవం, బోడ్రాయి, బోనాల పండుగలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మికవేత్త భాస్కరయోగి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు ఎంతో గోప్పవని, ప్రస్తుత తరం వారికి వాటి గురించి తెలియజేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని, అప్పుడే వారికి మన సంస్కృతి, సాంప్రదాయాల గొప్పతనం తెలుస్తుందని అన్నారు. అప్పట్లో గ్రామీణ ప్రాంతాల్లో ఇండ్ల ముందు కళ్లాపి చల్లేవారని, తద్వారా క్రిమి కిటాకాలు ఇంట్లోకి వచ్చేవి కావని, ప్రతి ఇంటి ముందు రంగవల్లులు వేసేవారని, ప్రతి ఇంటి గడపకు పసుపు, కుంకుమలు పెట్టెవారని, ఇంటికి మామిడి తోరాలు కట్టెవారని, ప్రతి ఇంటి ముందు కూర్చునేందుకు అరుగులు కట్టెవారని, గ్రామాల్లో రచ్చ బండాలు ఉండేవని, వాటి వద్ద గ్రామాల్లోని ప్రజల్లో వచ్చిన విభేదాలను, తగాదాలను అక్కడే పరిష్కారించేవారని, పండుగలను కులమతాలకు అతీతంగా ఊరంతా కలిసి ఎంతో ఆనందోత్సవాలతో చేసుకునేవారని, గ్రామాల్లోని ప్రజలందరూ ఒకరినొకరు అప్యాయతతో పలకరించుకునేవారని, ఒకరి ఇంట్లో శుభకార్యం జరుగుతుందంటే, గ్రామంలోని వారందరు సహకరించేవారని వివరించారు. గ్రామాల్లోని దేవాలయాలు అప్పట్లో ఆధ్యాత్మిక కేంద్రాలుగా ఉండేవని, ఉదయం నుంచి వ్యవసాయ పనుల్లో నిమగ్నమై, విరామం లేకుండా పనిచేసిన గ్రామస్థులు సాయంత్రం కాగానే దేవాలయాల వద్దకు చేరుకొని, భజనల చేసేవారని, త ద్వారా వారికి మానసిక ప్రశాంతత లభించేదని వివరించారు. ప్రస్తుత కంప్యూటర్ యుగంలో పాతకాలం నాటి వాతావరణం పూర్తిగా కనుమరుగు అయ్యిందని, అంతా రెడిమేడ్ యుగంగా మారిందని, ప్రతి ఒక్కరు ఏదో ఒక రకంగా ఒత్తిడికి గురువుతున్నారని, అందువల్ల ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని, తద్వారా మానసిక ప్రశాంతత, మానసిక ఉత్సాహం కలుగుతుందని అన్నారు. శ్రీఅంజనేయస్వామి దేవాలయం పంచమ వార్షికోత్సవంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ నెల 7వ తేదీ నుంచి దేవాలయం వద్ద చేస్తున్న పూజలతో గ్రామంలో భక్తిభావం పరిఢవిల్లింది. స్వామి వారికి పంచామృత అభిషేకం, విశేష అలంకరణ, లక్ష పుష్పార్చన కార్యక్రమాలను భక్తి, శ్రద్దలతో నిర్వహించారు. అనంతరం భారీ సంఖ్యలో హజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం వేళల్లో గ్రామంలో బోడ్రాయికి ప్రత్యేక పూజల అనంతరం భోనాలు చేసి మొక్కులను తీర్చుకున్నారు. కార్యక్రమాల్లో గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

### దళారీలను నమ్మి రైతులు మోసపోవద్దు :పిఏసిఎస్ చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా



ఆమనగల్లు, మేజర్ న్యూస్ (నవంబర్ 11) : నేడు బుధవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఆవరణలో పిఏసిఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు డిసిసిబి డైరెక్టర్, పిఏసిఎస్ చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని పి ఎ సి ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు దళారీలను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో దాన్యాన్ని అమ్ముకొని మద్దతు ధర పొందాలని ఆయన కోరారు. వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించేందుకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, మార్కెట్ చైర్మన్ యాట గీతా నరసింహ, వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి,ల తో కలిసిహాజరై ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. వడ్లకు క్వింటాలు మద్దతు ధర రూ. 2369,మరియు సన్న రకం వడ్లకు రూ. 5, వందల బోనస్ ప్రభుత్వం చెల్లించడం జరుగుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని గంప వెంకటేష్ గుప్తా కోరారు. ఈ సమావేశంలో సింగల్ విండో వైస్ చైర్మన్ డి. సత్యం, సీఈఓ గోరటి దేవేందర్ పాల్గొన్నారు.

# ఆర్.ఎం.సి డిస్పాచ్‌లు తిరిగి ప్రారంభం

● డిఫాల్టర్లపై కఠిన చర్యలు ● హైదరాబాద్ ఆర్.ఎం.సి ప్లాంట్ ఓనర్స్ అసోసియేషన్ కీలక నిర్ణయాలు



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (నవంబర్, 11):** హైదరాబాద్ పరిధిలోని అన్ని రెడీమిక్స్ కాంక్రీట్ ప్లాంట్ యజమానుల సమాఖ్య అయిన ఆర్.ఎం.సి ప్లాంట్ ఓనర్స్ అసోసియేషన్ – హైదరాబాద్, ఇటీవల నిర్వహించిన 'డిస్పాచ్ హలిడే' కార్యక్రమాన్ని మంగళవారం విజయవంతంగా ముగించిన అనంతరం మళ్లీ కార్యకలాపాలను పునరుద్ధరించింది. ప్లాంట్ యజమానుల ఐక్యత, కృషి, మరియు సహకారంతో ఈ ఉద్యమం విజయవంతంగా పూర్తయిందని అసోసియేషన్ ప్రకటించింది.

రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు పైళ్ల మోహన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిడి బాల్ రెడ్డి ఆధ్వర్యంలో కీసర మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ విషయాలను వెల్లడించారు.

**పరిశ్రమ పునరుద్ధరణకు కీలక చర్చలు:**

సమావేశంలో హైదరాబాద్ నగర పరిధిలోని 200కి పైగా ప్లాంట్ యజమానులు పాల్గొన్నారు. చెల్లింపుల నిలుపుదల, పెరిగిన ఉత్పత్తి వ్యయాలు, పరిశ్రమలో ఐక్యత, మరియు భవిష్యత్ వ్యూహాలపై సుదీర్ఘంగా చర్చించబడింది. అసోసియేషన్ అధ్యక్షులు, జోన్ ప్రతినిధులు, మరియు ప్రధాన సభ్యులు పాల్గొని పలు ముఖ్య నిర్ణయాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

**డిఫాల్టర్లపై కఠిన పాలసీ:**

సభలో తీసుకున్న ప్రధాన తీర్మానం 'బ్యాడ్ డెబ్టర్స్ పాలసీ' గురించి... ఇకపై ఎవరైనా కాంట్రాక్టర్, బిల్డర్ లేదా వ్యక్తిగత కస్టమర్ చెల్లింపులు నిలిపివేస్తే లేదా ఆలస్యం చేస్తే, వారి పేర్లు అసోసియేషన్ డిఫాల్టర్ లిస్టులో చేర్చబడతాయని పేర్కొన్నారు. ఆ లిస్టులో పేరు ఉన్న కస్టమర్‌కు ఏ ప్లాంట్ (MNCలు సహా) కాంక్రీట్ సరఫరా చేయరాదని తీర్మానించారు. ఈ నిర్ణయాల ధృవీకరణ మరియు అధికారిక ప్రకటన జోన్ ప్రతినిధులు లేదా అసోసియేషన్ అధ్యక్షులు ద్వారా మాత్రమే జరుగుతుందని తెలిపారు. ఈ నిబంధనలు సభ్య ప్లాంట్లతో పాటు బహుళజాతి కంపెనీలకు కూడా తప్పనిసరిగా వర్తిస్తాయని స్పష్టం చేశారు.

**డిస్పాచ్‌ల పునరుద్ధరణ నిర్ణయం:**

అసోసియేషన్ సభ్యులందరూ తమ డిస్పాచ్‌లను తిరిగి ప్రారంభించాలనే నిర్ణయం తీసుకున్నారు. అయితే, నిర్దేశించిన రేట్లు మరియు విధానాలను కచ్చితంగా పాటించాలనే అంశాన్ని అధ్యక్షుడు పైళ్ల మోహన్ రెడ్డి ప్రత్యేకంగా సూచించారు. సభ్యులంతా పరస్పర సహకారంతో, ఐక్యతతో పరిశ్రమను ముందుకు తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో అసోసియేషన్ రాష్ట్రవ్యాప్తంగా సమన్వయ చర్యలను కొనసాగిస్తుందని ఆయన తెలిపారు.

**కస్టమర్లకు స్పష్టమైన సందేశం:**

ప్రియమైన కస్టమర్లకు అసోసియేషన్ స్పష్టమైన సందేశం ఇచ్చింది. ఈ నిర్ణయాలు లాభం కోసం కాదు, పెరిగిన ఉత్పత్తి ఖర్చులు, ఇంధన వ్యయాలు, మరియు ఆర్థిక ఒత్తిడి కారణంగా పరిశ్రమను నిలబెట్టుకునేందుకు మాత్రమే తీసుకున్న చర్యలని పేర్కొంది. "మన ఉద్దేశం వ్యాపార లాభం కాదు, పరిశ్రమ స్థిరత్వం మరియు ఉద్యోగుల భద్రతను కాపాడడమే. మీ సహకారం, సహనం, మరియు అర్థం చేసుకోవడమే మా బలం," అని అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు.



# శామీర్‌పేట సహకార సంఘం అభివృద్ధి ఆదర్శం

● నాబార్డు ఆధ్వర్యంలో పిఏసీఎస్ సీఈఓలకు శిక్షణ
● రెండవ రోజు సందర్శన



**శామీర్‌పేట,మేజర్ న్యూస్ (నవంబర్, 11):** నాబార్డు మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు సంయుక్త ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల పిఏసీఎస్ సహకార సంఘాల సీఈఓలు, సెక్రటరీలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం రెండవ రోజు మంగళవారం శామీర్‌పేట్ వ్యవసాయదారుల సేవా సహకార సంఘాన్ని సందర్శించారు.

**రైతులకు సమగ్ర సేవలు – చైర్మన్ డా. రామిడి మధుకర్ రెడ్డి:**

ఈ సందర్భంగా సహకార సంఘం చైర్మన్ డా. రామిడి మధుకర్ రెడ్డి మాట్లాడుతూ,.. శామీర్‌పేట్ సహకార సంఘం రైతులకు అందిస్తున్న పలు సదుపాయాలను వివరించారు. అలాగే 'రైతులకు రుణ సదుపాయాలు, ఎరువులు, విత్తనాల పంపిణీతో పాటు ఫార్మ్ రైస్ వన్ ప్రాజెక్టు ద్వారా మార్కెట్ లింకేజీ అందిస్తున్నాము. డ్రోన్ స్ప్రేయర్ సేవలు, తక్కువ ధరలో టార్పాలిన్ విక్రయం, సీఎస్సీ సెంటర్ ద్వారా ఆన్లైన్ సేవలు అందుబాటులో ఉన్నాయి" అని ఆయన తెలిపారు.

**'సంఘ అభివృద్ధి ప్రశంసనీయం' – నాబార్డు అధికారులు:**

నాబార్డు ప్రతినిధులు శీలా, సతీష్, యోగేష్ మాట్లాడుతూ, "శామీర్‌పేట్ సహకార సంఘం అభివృద్ధి చూసి మేము హర్షం వ్యక్తం చేస్తున్నాము. రైతు అవసరాలను గుర్తించి సంఘం అందిస్తున్న సేవలు ఆదర్శనీయమైనవి" అని అభిప్రాయపడ్డారు.

**"ఇలాంటి కార్యక్రమాలను మా రాష్ట్రాల్లోనూ అమలు చేస్తాం" – సీఈఓలు:**

ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల పిఏసీఎస్ సీఈఓలు మాట్లాడుతూ,.. "శామీర్‌పేట్ సంఘంలో జరుగుతున్న ఆధునిక అభివృద్ధి కార్యక్రమాలు మాకు ప్రేరణనిచ్చాయి. ఈ సంఘాన్ని ఆదర్శంగా తీసుకొని మా రాష్ట్రాల్లో కూడా ఇలాంటి కార్యక్రమాలను ప్రవేశపెడతాం" అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో నాబార్డు అధికారులు శీలా, సతీష్, యోగేష్, సంఘ డైరెక్టర్లు మ్యాకల ఐలయ్య, ముద్దం ప్రతాప్ రెడ్డి, లక్ష్మిగారి నర్సింహులు, ఆకుల చంద్రకళ, సంఘ సీఈఓ మరియు సిబ్బంది పాల్గొన్నారు.



## కోడె దూడల వేలంలో రూ. 2.32 లక్షల ఆదాయం

వికారాబాద్, మేజర్‌న్యూస్ (నవంబర్ 11): కార్తిక మాసం పెద్ద జాతర ఉత్సవాల సందర్భంగా శ్రీ అనంత పద్మనాభ స్వామి వారికి మొక్కుబడిగా వచ్చిన కోడె దూడలను మంగళవారం వేలం వేసినట్లు ఆలయ ఈఓ టి. నరేందర్ తెలిపారు. మొత్తం 11 జతలు (22) దూడలు రాగ అందులో 5 జతలను కొత్తపల్లి గ్రామానికి చెందిన కృష్ణయ్య రూ. 97000 లకు తీసుకోవడం జరిగిందన్నారు. 3 జతలను గోదుమగూడ గ్రామానికి చెందిన శంకరయ్య గౌడ్ రూ. 67500 లకు తీసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా 2 జతలను మున్నూరు సోమారం గ్రామానికి చెందిన టి. రవి రూ. 37500 లకు, 1 జత మున్నూరు సోమారానికి చెందిన దయాకర్ రూ. 30000 లకు తీసుకున్నారని పేర్కొన్నారు. ఈ వేలంలో మొత్తం రూ 2,32,000 ఆదాయం సమకూరిందని ఆలయ ధర్మకర్త ఎన్ పద్మనాభం, ఈఓ టి. నరేందర్ తెలిపారు.



## నాణ్యత ప్రమాణాలు పాటించాలి...

▶▶ అభివృద్ధి పనులను పర్యవేక్షించిన కమిషనర్ టిఎస్‌విఎన్ త్రిలేశ్వర రావు



పలు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ త్రిలేశ్వర్ రావు

**మేడిపల్లి మేజర్ న్యూస్ నవంబర్ 11**

పీర్జాదిగూడ నగరపాలక సంస్థ పరిధిలోని వివిధ డివిజన్లలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను మంగళవారం నాడు నగరపాలక సంస్థ కమిషనర్ టిఎస్‌విఎన్ త్రిలేశ్వర్ రావు పర్యవేక్షించారు.అనంతరం కమిషనర్ మాట్లాడుతూ జరుగుతున్న అభివృద్ధి పనులకు తగిన విధంగా నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ వినీల్ కుమార్ గౌడ్, వర్క్ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## 103వ మెథడిస్ట్ క్రిస్టియన్ జాతరను ప్రారంభించిన బిషప్ షిమోన్



**ధారూర్,మేజర్ న్యూస్ (నవంబర్ 11):** స్టేషన్ ధారూర్ మెథడిస్ట్ క్రిస్టియన్ 103 వ జాతర ను మంగళవారం బిషప్ షిమోన్, మార్క్,స్టీవెన్,భక్తులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా యేసు నామ స్మరణతో సిలువ దగ్గరకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా బిషప్ సీమోన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం తో పాటు, కర్ణాటక,కేరళ, మహారాష్ట్ర,ఢిల్లీ, వివిధ ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారని వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని పవర్ స్టార్లకు తెలిపారు. భక్తులు సన్మార్గంలో నడిచి భావితరాలకు యేసు నామ స్మరణలను జపిస్తూ ముందుకు సాగాయతే యేసయ్య మనకు అంత మంచి చీకరుస్తాడని ఆయన అన్నాడు.

## 108 వాహనాన్ని సందర్శించిన నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా బృందం

**అత్యవసర వైద్య పరికరాల పనితీరు పరిశీలన - సేవలపై సంతృప్తి వ్యక్తం**



**మేడ్చల్, మేజర్ న్యూస్ (నవంబర్ 11):** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని గుండ్లపోచంపల్లి ప్రాంతంలో ఉన్న 108 అంబులెన్స్‌ను నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా బృందం మంగళవారం సందర్శించింది. అంబులెన్స్‌లో ఉన్న అత్యవసర వైద్య పరికరాల పనితీరు, ఔషధాల లభ్యత మరియు సేవల సమర్థతపై అధికారులు సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. బృంద సభ్యులు అంబులెన్స్‌లో అందుబాటులో ఉన్న ఆక్సిజన్ సిలిండర్లు, హార్ట్ మానిటర్లు, సక్షన్ మెషిన్‌లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు వంటి పరికరాల పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు తక్షణ చికిత్స అందించేందుకు ప్రభుత్వం మరియు ఈఏమ్ఆర్ఐ–గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థ సంయుక్తంగా అన్నీ రకాల ఆధునిక సదుపాయాలను ఏర్పాటు చేశారని ఎన్హెచ్ఏఐ బృందం వెల్లడించింది.ఈ సందర్భంలో ఎన్హెచ్ఏఐ అధికారి శివకుమార్, మేడ్చల్ జిల్లా 108 కోఆర్డినేటర్ తిరుపతి, గుండ్లపోచంపల్లి 108 సిబ్బంది పాల్గొన్నారు. అధికారులు 108 సేవలను ప్రజలకు మరింత వేగంగా, సమర్థంగా అందించాలనే దిశగా సిబ్బందిని ప్రోత్సహించారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్స్‌లు రద్దు చేస్తాం:ఏవో శంకర్‌లాల్



చేవెళ్ల, మేజర్‌న్యూస్ (నవంబర్ 11): ఫర్టిలైజర్ వ్యాపారులు రైతులను మోసం చేస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి శంకర్‌లాల్ అన్నారు. మైకో కంపెనీ విత్తనాలపై రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం మున్సిపల్ పరిధిలోని కందవాడ గ్రామంలో రైతులు సాగు చేసిన బీట్‌రూట్ పంటను పరిశీలించారు. అనంతరం పట్టణ కేంద్రంలోని చెన్నకేశవ, అయ్యప్ప, శ్రీమంజునాథ ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ.... రైతులకు మాయమాటలు చెప్పి నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్స్‌లను రద్దు చేసి శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొలకెత్తని విత్తనాలు విక్రయించారని రైతులు ఫిర్యాదు చేశారని, ఫిర్యాదులను పరిశీలించి రైతులకు అమ్మిన విత్తనాలు నకిలీవి అని తేలితే ఫర్టిలైజర్ దుకాణాలను సీజ్ చేస్తామన్నారు. ఆయన వెంట ఏఈవోలు స్వాతి, రైతులు తదితరులు ఉన్నారు.






# ట్రాక్టర్, ఆటో ఢీ

## ట్రాక్టర్ డ్రైవర్ మృతి ఆటో డ్రైవర్ పరిస్థితి విషమం








ప్రమాదంలో మృతి చెందిన రాములు, కాలురి వీరేష్, తిరగబడ్డ ట్రాక్టర్,

తలకొండపల్లి, మేజర్‌న్యూస్ (నవంబర్ 11) : ట్రాక్టర్ ఆటో ఎదురెదురుగా ఢీ కొట్టు కోవడంతో ట్రాక్టర్ డ్రైవర్ ప్రమాద స్థలంలోనే మృతి చెందగా ఆటో డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉండటంతో అంబులెన్స్‌లో హైదరాబాద్ తరలించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వెంకట్రావుపేట్ గ్రామానికి చెందిన పోలే రాములు (40) గ్రామ పంచాయతీ సిబ్బందిగా పనిచేస్తున్నాడు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కెంచ హైమాతి రమేష్ తన వ్యవసాయ పనుల నిమిత్తం ఇటీవల సెకండ్ హాండ్ ట్రాక్టర్ కొనుగోలు చేశారు. రమేష్‌కు ఇటివల షేరికల్చర్ ద్వార పట్టు పురుగుల పెంపకం గిడ్డంగి మంజూరు కాగా గిడ్డంగి వసరమైన దస్టును తీసుకరావడానికి తన ట్రాక్టరును పోలే రాములు ఇచ్చి పంపగా దొంగ రోడు దగ్గర పద్మా గార్డెన్ సమీపంలో చుక్కాపూర్ గ్రామానికి చెందిన బాల్‌రాజ్‌కు చెందిన ఆటో యడవల్లి గ్రామాకి చెందిన కాలురి వీరేష్ డ్రైవింగ్ (30) ఆటోను వెంకట్రావుపేట్ గ్రామంలో కూలీలను తీసుకు వెళ్ళడానికి వస్తుండగా ట్రాక్టర్ ఆటో ఎదురెదుగా ఢీ కొట్టుకొవడంతో ట్రాక్టర్ తిరగబడి పోలే రాములు అక్కడికక్కడే మృతి చెందగా ఆటో డ్రైవర్ కాలురి వీరేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో మేరుగైన వైద్యం కోసం అంబులెన్స్ ద్వార హైదరాబాద్ తరలించారు. తలకొండపల్లి ఎస్సై శేఖర్ సంఘటన స్థలానికి చేరుకొని రాములు మృత దేహాన్ని పోస్టు మాస్టరం నిమిత్త కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## రాష్ట్రస్థాయి సీనియర్ ఖో-ఖో ఛాంపియన్‌గా

# ఉమ్మడి రంగారెడ్డి జిల్లా

- పెద్దపల్లి టోర్నమెంట్‌లో ఘన విజయం
- మహిళల జట్టు ద్వితీయ స్థానంలో

శామీర్‌పేట, మేజర్ న్యూస్ (నవంబర్ 11):

పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నవంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి 58వ సీనియర్ ఖో–ఖో టోర్నమెంట్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పురుషుల జట్టు ఛాంపియన్‌గా అవతరించింది. మహిళల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచినట్లు రంగారెడ్డి జిల్లా ఖో–ఖో సంఘం అధ్యక్షులు వి. మంజుల, కార్యదర్శి తోట జయప్రకాశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన క్రీడాకారులను కోచ్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఖో–ఖో సంఘం ఉపాధ్యక్షుడు గుర్రం సత్తిరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “గత పది సంవత్సరాల తర్వాత ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పురుషుల జట్టు ప్రథమ స్థానం సాధించడం గర్వకారణం” అని పేర్కొన్నారు.

ఈ టోర్నమెంట్‌లో ‘బెస్ట్ డిఫెండర్ అవార్డు’ గున్న సుధీర్‌కుమార్‌కు, ‘కొమరం భీమ్ అవార్డు’ జానకిరామ్‌కు లభించినట్లు తెలిపారు.

తూముకుంటలో 10 రోజులపాటు నిర్వహించిన శిక్షణా శిబిరం జట్టు విజయానికి కీలక పాత్ర పోషించిందని గుర్రం సత్తిరెడ్డి




తెలిపారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఖో–ఖో పురుషుల జట్టులో తూముకుంట మున్సిపాలిటీకి చెందిన జైహింద్ ఖో–ఖో క్లబ్‌నుంచి ఎనిమిది మంది క్రీడాకారులు పాల్గొనడం విశేషం. ఈ విజయంలో తమ విద్యార్థులు పాత్ర పోషించడంతో తూముకుంట సీనియర్ క్రీడాకారులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

జట్టు విజయం సందర్భంగా తూముకుంట జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి, ఉమ్మడి శామీర్‌పేట యుటీఎఫ్ అధ్యక్షుడు తిరుమలేష్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఖో–ఖో సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్ యాదవ్, సీనియర్ క్రీడాకారులు రఘు వర్ధన్ గౌడ్, సందీప్ గౌడ్, వినోద్ కుమార్, సోమేష్ తదితరులు జట్టు సభ్యులను అభినందించారు.

## జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట బందోబస్తు

### జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి



ధారూర్,మేజర్ న్యూస్ (నవంబర్ 11):

ధారూర్ మెథడిస్ట్ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు.మంగళవారం స్టేషన్ ధారూర్ మెథడిస్ట్ జాతర ప్రారంభం కావడంతో జాతరను జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి సందర్శించి జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 3 డిఎస్పీలను,8 మంది సీఐలను,30 మంది ఎస్ఐలను,300 మంది పోలీసు సిబ్బందితో బందోవస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన మీడియాకు వెల్లడించాడు.భక్తులకు ఇలాంటి అంతరాయం ఏర్పడిన పోలీస్ కంట్రోల్ రూమ్ ను సందర్శించాలని ఆయన తెలిపారు.ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.వీరితో పాటు వికారాబాద్ డీఎస్పి శ్రీనివాస్ రెడ్డి,ధారూర్ సిఐ రఘురాములు,ఎస్సై రాఘవేందర్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు పట్టాలు అందజేత



ఆమనగల్లు మేజర్ న్యూస్ (నవంబర్ 11) : పట్టణంలోని శ్రీలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో నేడు బుధవారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల కు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఇంది రమ్మ ఇండ్ల పట్టాలను అందజేయనున్నట్లు ఎంపీడీవో కుసుమ మాధురి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా మండలానికి ఎమ్మెల్యే కృషితో తొలి విడతలో 324 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని చెప్పారు. అందులో నేటికీ నిర్మాణం చేపట్టని వాటి స్థానంలో కొత్తగా మంజూరైన పదిమంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే మంజూరు పత్రాలను పంపిణీ చేస్తారని ఆమె వివరించారు. కార్యక్రమానికి లబ్ధిదారులు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

## ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన ఎండిఓ గ్యామా




దోమ: మంగళవారం నాడు దోమ మండల పరిధిలోని దోమలో ఇందిరమ్మ ఇండ్లను ఎండిఓ పి.గ్యామా పరిశీలించడం జరిగింది. వారు లబ్ధిదా రులతో మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు వచ్చినవారు తొందరగా బేస్మెంట్ పూర్తిచేయాలనిసూచించారు .అదేవిధంగా ఇందిరమ్మ ఇండ్లు బేస్మెంట్ పూర్తి చేసినవారికి లబ్ధిదారులకు ఫస్ట్ విడతలో 1 ఒక లక్ష రూపాయలు మీ యొక్క అకౌంట్లో డబ్బులు జమ అవుతాయని లబ్ధిదారులకు తెలియజేయడం జరిగింది. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం నేటి తరానికి ఆదర్శం

ఆమనగల్లు మేజర్ న్యూస్ (నవంబర్ 11) బుధవారం పట్టణంలో స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా మెకానిక్ బాబా. మండల జేఏసీ అధ్యక్షులు అవ్వారి శివలింగం. ఔఖిజతి రాష్ట్ర కార్యదర్శి ఫరీద్. కాంగ్రెస్ నాయకుడు కరీమ్. సంచార జాతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసల పరమేష్. మండల ఉపాధ్యక్షులు సూదిని కొండల్ రెడ్డి. పెయింటర్ సంఘం అధ్యక్షుడు మహేష్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్వాతంత్ర్య పోరాటంలో పోషించిన కీలక భూమికను గుర్తు చేశారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం నేటి తరానికి ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖలీమ్, ఇమ్రాన్. శీను. తదితరులు పాల్గొన్నారు.



## ఏజీఆర్ కాలనీలో డ్రైనేజీ పనుల కోసం రోడ్డెక్కిన కాలనీవాసులు

-"సమస్యలు కోసం దాదాపు రెండు గంటలు కాలనీవాసులు రోడ్డుపై బైఠాయించి నిరసన" -"ధర్నాకు స్పందించిన కమిషనర్ పుష్పల సరస్వతి.. వెంటనే పనులు ప్రారంభం" -"ఏ జి ఆర్ కాలనీ అధ్యక్షులు కె.ప్రమోద్ కుమార్ తోపాటు పలువురు కృతజ్ఞతలు"




బాలాపూర్, మేజర్ న్యూస్ (నవంబర్ 10): బదంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 30వ డివిజన్ ఏజీఆర్ కాలనీ ప్రజలు నెలల తరబడి తంటాలు పడుతున్న డ్రైనేజీ సమస్యపై రోడ్డెక్కారు. గత ఆరు నెలలుగా డ్రైనేజీ మురుగు నీరు రోడ్లపైకి పొంగిపోతోందని, అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఏజీఆర్ కాలనీ అధ్యక్షులు కంబాళపల్లి ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో కాలనీవాసులు బదంగ్‌పేట్ చౌరస్తా వద్ద దాదాపు రెండు గంటల పైనే నల్ల బ్యాడ్జీలతో ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ముందు కూర్చొని నిరసన తెలిపారు. రెండు గంటల పాటు రోడ్డుమీద బైఠాయించి నిరసన వ్యక్తం చేసిన కాలనీవాసులను డీ.ఈ. వెంకన్న, మేనేజర్ శ్రీధర్ రెడ్డి కలిసి సంప్రదించి డ్రైనేజీ పనులు తక్షణమే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బి ఆర్ ఎస్ నాయకుడు భీమిడి జంగారెడ్డి కాలనీ వాసులకు మద్దతు తెలుపుతూ ఆయన మాట్లాడారు...ఏజీఆర్ కాలనీ ప్రజలు ఆరు నెలలుగా మురుగు నీటితో ఇబ్బంది పడుతున్నారు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఇప్పటికే నిధులు మంజూరు చేయమని సూచించారు. అయినా అధికారులు నిర్లక్ష్యం చేయడం దారుణం అని మండిపడ్డారు. త అధికారులు నిధులు మంజూరు చేసిన పనులు చేయడంలో ఎందుకు నిర్లక్ష్యం ఇస్తున్నారని సూటిగా ప్రశ్నించారు. రోడ్డు మీద మురుగు నీరు ప్రవహించడంతో పాఠశాల బస్సులు, స్మశాన వాటికకు వెళ్లే వాహనాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని, రోగాల ప్రమాదం పెరుగుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. తర్వాత డీ.ఈ. వెంకన్న, మేనేజర్ శ్రీధర్ రెడ్డితో కలిసి డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ధర్నా కార్యక్రమంలో టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ లక్ష్మి దుర్గ, కాలనీ అధ్యక్షుడు బంగారుబాబు, ఎంసిఆర్ కాలనీ అధ్యక్షుడు మూర్తి, అరుణ్ గౌడ్, కాలనీ అధ్యక్షుడు మూర్తి, మాజీ అధ్యక్షుడు సురేష్, కాలనీవాసులు రామ్మోహన్ రెడ్డి, సంతోష్, కృష్ణారెడ్డి, నరసింహ చారి, రామకృష్ణ, శ్రీహరి, కృష్ణారావు, నాయుడు, చెన్నారావు, జగదీష్, మహేందర్, జగన్ తదితరులు పాల్గొన్నారు. కాలనీవాసుల ధర్నాకు వెంటనే స్పందించి డ్రైనేజీ పనులు ప్రారంభించిన కమిషనర్ పుష్పల సరస్వతి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, డీ.ఈ. వెంకన్న, మేనేజర్ శ్రీధర్ రెడ్డిలకు కాలనీవాసులతో పాటు అధ్యక్షులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆపదలో ఉన్నవారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఆసరాగా నిలుస్తుంది : మర్రి నిరంజన్ రెడ్డి





తుర్కయంజాల్, మేజర్ న్యూస్,( నవంబర్ 11 ) : ఆపదలో ఉన్నవారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో ఆసరాగా నిలుస్తుంది టీపీసీసీ సభ్యులు, అదిబట్ల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి అన్నారు. మంగళవారం అదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని మంగల్ పల్లి పటేల్ గూడా గ్రామానికి చెందిన బోడిగే బుగ్గమ్మ కు 60,000 రూపాయలు, మంచాల మండలం దాద్ పల్లి అనుబంధ గ్రామం వెంకటేశ్వర తండాకు చెందిన పలియా కళావతి కి 60,000 రూపాయల చెక్కులను నిరంజన్ రెడ్డి లబ్ది దారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో సీఎం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంజూరు చేయించి లబ్ధిదారులకు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ కౌన్సిలర్ కుంట్ల ఉదయపాల్ రెడ్డి, లబ్ధిదారులు బుడిగ జంగయ్య, రాజు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటాం : దేవర వెంకట్‌రెడ్డి, బండారి ఆగిరెడ్డి

చేవెళ్ల, మేజర్‌న్యూస్ (నవంబర్ 11): ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బండారి ఆగిరెడ్డి అన్నారు. చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని ఊరెళ్ల వార్డులోని పేరంపల్లి పరమేశ్ కూతురు శృతికి బ్రెయిన్ క్లాత్‌తో నగరంలోని కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. వైద్య ఖర్చుల కోసం తమవంతు సహకారంగా చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బండారి ఆగిరెడ్డి రూ.50వేలు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.... ఆపదలో ఉన్నవారికి ప్రతి ఒక్కరు తమకు తోచినంత సహకారం అందించాలని సూచించారు. సంపాదించిన దాంట్లో కొంతైన పేదలకు, సేవా కార్యక్రమాలకు ఉపయోగించాలన్నారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటే దేవునితో సమానమన్నారు. ఈకార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్, మాజీ



సర్పంచ్ ఎండీ జహంగీర్, నాయకులు కుంచం శివకుమార్, మంగలి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## బాంబు పేలుడులో చనిపోయిన కుటుంబాలను ఆదుకోవాలి

-సీపీఐ జిల్లా సీనియర్ నాయకులు ఎం.ప్రభులింగం



చేవెళ్ల, మేజర్‌న్యూస్ (నవంబర్ 11): దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట వద్ద బాంబు పేలుడులో చనిపోయిన వారిని, గాయపడిన వారిని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఐ జిల్లా సీనియర్ నాయకులు ఎం. ప్రభు లింగం అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ....కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఆదీనంలో ఉన్న ఢిల్లీలో బాంబు పేలుడు జరగడం ప్రభుత్వ వైఫల్యమని మండిపడ్డారు. దేశంలో శాంతిభద్రతలు కోల్పోయాయన్నారు. ప్రజలంతా ఐక్యంగా, శాంతి సామరస్యంగా మెలగాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా బాధ్యులైన కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. చనిపోయిన కుటుంబాలకు రూ. 1కోటి, గాయపడిన వారికి రూ. 50లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## నాటుసారా తయారీ, విక్రయాలకు పాల్పడి తే కఠినచర్యలు తప్పవు

- ఆమనగల్లు ఎక్సైజ్ సి.ఐ బద్యానాథ్ చౌహాన్ ఆధ్వర్యంలో కడ్తాల్ టోల్‌ప్లాజా ఎదుట అక్రమంగా తరలిస్తున్న 120 కిలోల నల్లబెల్లం, 120 కిలోల పటికను పట్టివేత
- ఇద్దరు నిందితులను అరెస్ట్‌చేసి ఒక ఆటో, రెండు సెల్‌ఫోన్‌ల స్వాధీనం – కేసు నమోదు
- ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించేవారిపై ఎక్సైజ్‌శాఖ ఉక్కుపాదం మోపుతుంది : సి.ఐ బద్యానాథ్‌చౌహాన్



కడ్తాల్, మేజర్‌న్యూస్ (నవంబర్ 11): ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించేవారిపై ఎక్సైజ్‌శాఖ ఉక్కుపాదం మోపుతుందని, ప్రజల ఆరోగ్యానికి హానికలిగించే నాటుసారా తయారీ, విక్రయాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బద్యానాథ్ చౌహాన్ హెచ్చరించారు. ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని నాలుగు మండలాల పరిధిలో నాటుసారా తయారీ, విక్రయాలపై ప్రత్యేక నిఘాతో పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు ఆయన వివరించారు. ఈమేరకు నాటుసారా తయారీకి ఉపయోగించే ముడిపదార్థాలను హైద్రాబాద్ నుండి వివిధ గ్రామాలకు తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం కడ్తాల్ మండల కేంద్రం సమీపంలోని టోల్‌ప్లాజా ఎదుట ఎక్సైజ్ సి.ఐ బద్యానాథ్ చౌహాన్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా యం. ప్రవీణ్, యం. బిచ్య అనే ఇద్దరు వ్యక్తులు టిజి 07యు 2571 నంబర్ గల ఆటోలో నాటుసారా తయారీకి ఉపయోగించే నల్లబెల్లం 4 బ్యాగుల్లో గుర్తించగా వాటిలో ఒక్కో బస్తాలో 30 కిలోల చొప్పున 4 బస్తాలలో 120 కిలోల నల్లబెల్లం ఉన్నట్లు సి.ఐ తెలిపారు. అదేవిధంగా అదే వాహనాన్ని తనిఖీ చేయగా ఒక్కో బ్యాగులో 40 కిలోల చొప్పున మొత్తం మూడు బ్యాగుల్లో 120 కిలోల (ఆలం) పటికను గుర్తించినట్లు ఆయన వివరించారు. అట్టిహనంలోమొత్తంగా 120 కిలోల నల్లబెల్లం, 120 కిలోల పటికను గుర్తించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు ఆటోను సీజ్‌చేసి వారి నుండి రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకోవడం జరిగిందని సి.ఐ బద్యానాథ్ చౌహాన్ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్.ఐ అరుణ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ శంకర్, కానిస్టేబుళ్ళు బాబు, శ్రీను, ఆమని తదితరులు పాల్గొన్నట్లు సి.ఐ బద్యానాథ్ చౌహాన్ వివరించారు.

## ఆలూరు గ్రామంలోకి బస్సు సౌకర్యం కల్పించాలి

చేవెళ్ల, మేజర్‌న్యూస్ (నవంబర్ 11): ఆలూరు గ్రామంలోకి బస్సు సౌకర్యం కల్పించి విద్యార్థులు, వృద్ధుల సమస్యలు తీర్చాలని ఆలూరు గ్రామ మాజీ వార్డు సభ్యులు సయ్యద్ అహమద్ తెలిపారు. ఆలూరు గ్రామానికి వికారాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులు ప్రతిరోజు సాయంత్రం 4:30, 5:20గంటలకు వస్తున్నాయని, ఆ బస్సుల్లో సుమారు 200మంది వరకు విద్యార్థులు, గ్రామస్తులు, రైతులు, వృద్ధులు ప్రయాణిస్తున్నారని చెప్పారు. బస్సులను గ్రామానికి ఒక కిలో మీటర్ దూరంలో ప్రయాణికులను వదిలి వెళ్లిపోతున్నాయన్నారు. దీంతో విద్యార్థులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గ్రామంలోకి బస్సులు రావాలని పలుమార్లు వికారాబాద్ డిపో మేనేజర్, చేవెళ్ల బస్‌స్టేషన్ కంట్రోలర్‌కు విన్నవించిన పట్టించుకోవడం లేదన్నారు. గ్రామంలోకి బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.